క్లుప్తంగా

ఏకగ్రీవంగా మత్స్య పారిశ్రామిక కమిటీ

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సొసైటీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్న నూతన కమిటీని శుక్రవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా పోలెమోని లక్ష్మణ్‌ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా పిట్టల రాములు, కార్యదర్శిగా పాండుముదిరాజ్, డైరెక్టర్లుగా శ్రీశైలం, యాదయ్యముదిరాజ్, నరహరి, లక్ష్మణ్, జగన్, వెంకటేష్‌లను ఎన్నుకున్నామన్నారు.

ఆస్తి పన్ను చెల్లించాలి

తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్



తుక్కుగూడ: మున్సిపాలిటీ ప్రజలు తమ ఇంటి, వాణిజ్య, వ్యాపార సముదాయాల పన్నును చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఆస్తి పన్ను చెల్లించేలా సిబ్బందితో అవగాహన కలిపిస్తామన్నారు. మార్చి 31 లోపు ప్రతి ఒక్కరూ ఆస్తి పన్నును విధిగా చెల్లించి, మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కందుకూరు: మండల పరిధిలోని సాయిరెడ్డి గూడ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు అండేకార్ నాగరత్నం ఆధ్వర్యంలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, అధికారులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. విద్యార్థిని సోటా హాస్నిక ప్రధానోపాధ్యాయురాలిగా, గూడూరు బ్లెస్సీ రేచల్ పాఠశాల చైర్మన్‌గా, కంద పార్దు ఎంఈఓగా వ్యవహరించారు. వారిని ప్రధానోపాధ్యాయుడు అభినందించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పైడినాయకుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుకల్యాణం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ ఆదిలక్ష్మి అలివేలుమంగా సమేత శ్రీబాలజీ వేంకటేశ్వర స్వామి తిరు కల్యాణ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం వైభవంగా స్వామి కల్యాణ వేడుకలు నిర్వహించారు. అంతకు ముందు ఎదుర్కోలు గజవాహన సేవ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తూళ్ల వీరేందర్ గౌడ్ కుటుంబ సభ్యులు, ఆలయ ధర్మకర్తలు శేషం జగన్నాథచార్యులు, సింహాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీఎంని కలిసిన కాంగ్రెస్ నేతలు



ముఖ్యమంత్రిని సత్కరిస్తున్న గోపాల్‌రెడ్డి తదితరులు

మీర్‌పేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం మీర్‌పేట కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సందర్భంగా గోపాల్‌రెడ్డి ముఖ్యమంత్రిని శాలువాతో ఘనంగా సత్కరించారు. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అందరిని కలుపుకుని పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సామిడి చరణ్‌రెడ్డి, భీమనపల్లి యాదిరెడ్డి ఉన్నారు.

శివగంగ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీదేవి

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజరాజేశ్వరీ దేవికి అభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ పూజలు చేశారు. ఆలయానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, డైరెక్టర్లు, పూజారులు పాల్గొన్నారు.



పెద్ద చెరువు కట్టపై పేరుకుపోయిన చెత్తాచెదారం



కట్ట రహదారిపై గుట్టలుగా దర్శనమిస్తున్న మట్టిదిబ్బలు

చెత్త పడేసి.. డంప్‌యార్డ్‌గా మార్చేసి!

- డంపింగ్‌యార్డుకు అడ్డాగా పెద్ద చెరువు కట్ట
- కట్ట రహదారిపై కానరాని స్వచ్ఛత

మీర్‌పేట: ఖాళీ స్థలం కనిపించిందంటే చాలు.. దాన్ని కొంతమంది డంపింగ్ యార్డుగా మార్చేస్తున్నారు. కానరాని స్వచ్ఛతతో డంపింగ్‌కు అడ్డాగా మారిన చెరువు కట్ట రహదారి. ఇలా మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువు కట్ట డంపింగ్ స్థావరంగా మారిపోయింది. వ్యర్థాలు, చెత్తా చెదారంతో పాటు భవనాల శిథిలాలను డంపింగ్ చేస్తున్నారని పరిసర కాలనీవాసులు వాపోతున్నారు. రహదారికి ఇరువైపులా మొత్తం చెత్తతోనే దర్శనమిస్తోందని, దీంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొందని వాహనదారులు విలపిస్తున్నారు. నిత్యం రహదారిపై వందలాది వాహనాల రాకపోకలు జరుగుతాయి. రాత్రివేళల్లో చెత్త కుప్పల్లో ఉండే వ్యర్థాల కోసం కుక్కలు గుంపుగా రావడంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు చెత్తను తరలించాల్సి ఉన్నప్పటికీ సిబ్బంది మూడు రోజులకు ఒకసారి తీసుకెళ్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో దుర్గంధం వ్యాప్తి చెంది దోమలు ప్రజ్వరిల్లుతున్నాయి. అంతేకాకుండా ఉదయం పూట చెత్తను తరలించాల్సి ఉండగా సిబ్బంది అక్కడే కాలుస్తున్నారని, దీంతో పొగ అంతా ఇళ్లలోకి వస్తోందని సమీప కాలనీవాసులు చెబుతున్నారు.

తూతూమంత్రంగా జరిమానాలు

బహిరంగ ప్రదేశాలు, ప్రధాన రహదారులపై చెత్త వేసిన వారికి గతంలో కార్పొరేషన్ అధికారులు జరిమానాలు విధించారు. కొంత కాలంగా అటు సిబ్బంది, ఇటు శానిటేషన్ అధికారులు గాని పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏదో తూతూమంత్రంగానే జరిమానాలు విధించి, ఆ తరువాత నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికొస్తోందని ప్రజలు వాపోతున్నారు. రోజు వారీగా చెత్తను తరలించడంతో పాటు రోడ్లపై వ్యర్థాలు వేసే వారిపట్ల కఠినంగా వ్యవహరించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గులాబీ జెండా ఎగరడం ఖాయం

చేవెళ్ల గెలుపుపై ధీమా వ్యక్తం చేసిన పార్టీ నాయకులు



కందుకూరులో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కందుకూరు: మరోసారి చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్ రెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. ఎమ్మెల్యే సబితారెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 24న జిల్లెలగూడలోని సామ యాదిరెడ్డి గార్డెన్స్‌లో మహేశ్వరం బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారన్నారు. చేవెళ్ల పార్లమెంట్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌తో పాటు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతున్నారన్నారు. మండలంలోని పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ దేవేందర్, డైరెక్టర్లు ఆనంద్, శేఖర్‌రెడ్డి, నాయకులు ప్రకాష్‌రెడ్డి, పర్వతాలుయాదవ్, సామయ్య, దర్శన్‌రెడ్డి, కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, రామకృష్ణ, వెంకటేశ్, లక్ష్మణ్‌చారి, కృష్ణారెడ్డి, గణేశ్ పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



ఆమనగల్లు: ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ధర్మకర్త కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున్న దుకాణాలు వెలిశాయి.

స్వామివారికి పల్లకీసేవ..

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్‌లో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సీతా రామంజనేయస్వామి భజన మండలి ఆధ్వర్యంలో శుక్రవారం స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్, మాజీ సర్పంచ్ వితలయ్యగౌడ్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్, నాయకులు రంగయ్య, బాలకృష్ణ, లింగం, రమేశ్‌యాదవ్, రాజు, పవన్, రవికుమార్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



మాట్లాడుతున్నకాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్

సర్దార్‌నగర్ మహిళా సమావేశంలో నేతలు

తుక్కుగూడ: చేవెళ్ల గడ్డపై పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో పార్టీ మహిళా కార్యకర్తల విస్తృత్త స్థాయి సమావేశం తుక్కుగూడ మహిళా అధ్యక్షురాలు కందుల సమత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్లార్, అనితారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం చేయాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. చేవెళ్ల పార్టీ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకంతో ఉచిత బస్సు ప్రయాణం కలిపించిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగారెడ్డి, జానకీరామ్, జయమ్మ, మమత, సావిత్రి, మంగ, లలిత, సుజాత, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

జల సంరక్షణకు కృషి చేయాలి



జల దినోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయురాలు పద్మిని

సైదాబాద్: జల సంరక్షణ కోసం అందరూ కృషి చేయాలని శ్రీసాయినగర్ అంగన్‌వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలు సుంచు పద్మిని కోరారు. శుక్రవారం ఐఎస్‌సదన్ డివిజన్ శ్రీసాయినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ జల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బస్తీ మహిళలు, చిన్నారులకు తాగునీటి ప్రాధాన్యం గురించి ఉపాధ్యాయురాలు వివరించారు. అవసరాలకు అనుగుణంగా తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని అన్నారు. మంచి నీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వృథా చేయవద్దని ఉపాధ్యాయురాలు చిన్నారులకు సూచించారు. కార్యక్రమంలో కేంద్రం సహాయకురాలు సక్కు, బస్తీ మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

హస్తినాపురం: ప్రతి ఒక్కరూ ధర్మాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని.. ఆ ధర్మమే మనల్ని కాపాడుతుందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్‌లోని హరిహరక్షేత్ర అయ్యప్ప ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ వంగా మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో మూడవ రోజైన శుక్రవారం ఉదయం నిర్వహించిన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీరమాలక్ష్మీ అమ్మవార్ల ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ట కార్యక్రమానికి రాకేశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌తో కలిసి పూజలు చేశారు. హంపీ విరూపాక్ష విద్యారణ్యభారతి సమక్షంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో రమణగురు స్వామి, బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామశరన్‌శర్మ గురూజీ, ఆలయ కమిటీ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి గడ్డం మంగారెడ్డి, డైరెక్టర్లు సద్ది సందీప్ రెడ్డి, లంకల రమేశ్‌రెడ్డి, లింగాల దశరథ గౌడ్, విఘ్నేశ్వర్‌రెడ్డి, అంజయ్యగుప్తా, సుంకరి రమేశ్‌గౌడ్, నిర్మలేశ్‌గుప్తా, హరికృష్ణగుప్తా, సూర్యప్రకాశ్‌గుప్తా, మణిపాల్‌రెడ్డి, వంగా ప్రవీణ్‌రెడ్డి, మల్లికార్జున్‌గుప్తా, కేశవరెడ్డి, భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందాలి

ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



తుక్కుగూడలో ఆస్పత్రిని ప్రారంభిస్తున్న రాజనర్సింహ, జానారెడ్డి

తుక్కుగూడ: ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు నాణ్యమైన వైద్యం అందజేయాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కొండేటి ఆస్పత్రిని మాజీ మంత్రి కె.జానారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, నాయకులు కొండేటి మల్లయ్య, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం-హైదరాబాద్ హైవేపై తనిఖీ



శ్రీశైలం రహదారిని తనిఖీ చేస్తున్న రోడ్డు భద్రతా అధికారుల బృందం

కందుకూరు: రోడ్డు భద్రతా అధికారుల బృందం శుక్రవారం మండల పరిధిలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిని తనిఖీ చేసింది. రోడ్డు సేఫ్టీ ఇన్స్‌పెక్టర్ నాగరాజు, ఎన్‌హెచ్ఎస్ సైట్ ఇంజనీర్ హర్షిణి, బ్రిడ్జ్ ఇంజనీర్ శ్రీనివాస్, స్థానిక సీఐ మక్బూల్‌జానీ బృందం అధికంగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన విషయాలను చర్చించారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

అద్భుతంగా థీమ్ పార్కు నిర్మాణం



థీమ్‌పార్కు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: దాదాపు ఎకరం స్థలంతో అద్భుతమైన థీమ్ పార్కును బీఎన్‌రెడ్డి నగర్‌లో నిర్మిస్తున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డిన్ ఫేజ్–3లో రూ.1.25 కోట్లతో నిర్మిస్తున్న థీమ్‌పార్కు పనులను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, థీమ్ పార్కులో అద్భుతమైన బుద్ధుడి విగ్రహం, యోగా షెడ్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు, వాకింగ్ ట్రాక్, టాయిలెట్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని అభివృద్ధి పనులను త్వరిగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు తెలిపారు. నియోజక అభివృద్దే లక్ష్యమని స్పష్టంచేశారు. కార్యక్రమంలో నాయకులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనంతుల రాజిరెడ్డి, రవి, రాఘవేందర్‌రావు, రాంబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మ

మాడ్గుల: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మ అన్నారు. మాడ్గుల మండలం అర్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషక పక్షం ని ర్వహించారు. చౌకగా దొరికే ఆకుకూరలు, కూ రగాయలతో పోషకాహారాన్ని తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం పద్మ మాట్లా డారు. ఆహర లేమితో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, మహిళల్లో రక్తహీ నత వచ్చే ప్రమాదముందన్నారు. పోషక విలువలున్న ఆహారపదార్థాలను సమతుల్యంగా తీసుకోవడంతోనే రక్తహీనతను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గీత, విజయలక్ష్మి, దేవమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ సిబ్బంది అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషక పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. చౌకగా దొరికే ఆకుకూరలు, కాయగూరలతో పోషక ఆహారాన్ని తయారుచేసి ప్రదర్శించారు. ఐసీడీఎస్, అంగన్‌వాడీ అధికారులు పోషక ఆహారంపై మహిళలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, మహిళలు, ఆశ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సమాజంలో అవినీతిని అరికట్టాలి

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

దిల్‌సుఖ్‌నగర్: న్యాయశాస్త్ర విద్యార్థి రాజ్యాంగాన్ని గౌరవించడంతో పాటు సమాజంలోని అసమానతలను అవినీతిని న్యాయమార్గంలో ఎదుర్కోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ సూచించారు. ఆర్‌కేపురం డివిజన్ చిత్రా లేఅవుట్‌లోని మహాత్మా గాంధీ న్యాయ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ, న్యాయశాస్త్ర అభ్యాసంలో విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించినప్పుడే తమ వృత్తిలో రాణించగలుగుతారన్నారు. ప్రస్తుత కాలంలో న్యాయశాస్త్ర విద్యార్థులకు వివిధ రంగాలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ఉస్మానియా న్యాయ కళాశాల సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ జీబీ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు పట్టుదలతో న్యాయశాస్త్రాన్ని అభ్యాసం చేయాలన్నారు. కళాశాలలో ప్రతి అంశం గురించి క్షుణ్ణంగా నేర్చుకోవాలని సూచించారు. జూనియర్ సివిల్ న్యాయమూర్తిగా ఎంపికైన కళాశాల పూర్వ విద్యార్థి హరీష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల సెక్రటరీ గంగుల గోవర్ధన్ రెడ్డి , ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్‌వీ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త రోడ్డు వేస్తామని.. తవ్వి వదిలేశారు!

కంకర వేసి చేతులు దులుపుకొన్న కాంట్రాక్టర్

- నాలుగు నెలలైనా పత్తాలేని వైనం
- నడవడానికి నరకయాతన పడుతున్న కాలనీవాసులు
- గడ్డిఅన్నారం డివిజన్ కోదండరాం కాలనీలో పరిస్థితి



కంకర వేసి వదిలేసిన రోడ్డు

ఎల్‌బీనగర్: కొత్త రోడ్లు వేస్తామని ఉన్న రోడ్లు తవ్వేశారు.. నాలుగు నెలలైనా కొత్త రోడ్ల ఊసే లేదు.. దీంతో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లపై వాహనలే కాదు.. కనీసం నడక కూడా నరకయాతనగా మారింది. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కోదండరాం కాలనీలో రామాలయ వీధిలోని రహదారి పరిస్థితి ఇదీ. కాలనీలోని సీసీ రోడ్లకు అక్కడక్కడ గుంతలు పడటంతో కొత్తగా రోడ్లు వేయాలని అధికారులు నిర్ణయించారు. రూ.35 లక్షల అంచనాలు వేసి టెండర్ ప్రక్రియ పూర్తి చేసి వెంటనే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు

- సదరు కాంట్రాక్టర్ నాలుగు నెలల క్రితం ఉన్న రోడ్లు మొత్తం తవ్వి కంకర వేసి పత్తా లేకుండా పోయాడు.
- ఈ వీధిలోనే ఉన్న రామాలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేస్తుంటారు. వచ్చే నెలలో నిర్వహించే రాములోరి కల్యాణానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. కంకర తేలిన ఈ రోడ్డుపై భక్తులు ఆలయానికి రావాలంటే నరకయాతన తప్పదు.
- కంకర తేలి ఉండటంతో రహదారిపై వెళ్లాలంటే వాహదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డుపై వాహనాలు వెళ్తే టైర్లకు రాళ్లు గుచ్చుకొని పంచర్లు అవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- శ్రీరాం నవమి ఉత్సవాల లోపు రామాలయ వీధిలోని రోడ్డు పనులు కాకపోతే మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు.
- అయితే, తనకు రావాల్సిన పాత బిల్లులు చెల్లించకపోవడంతోనే కాంట్రాక్టర్ ఈ రోడ్డు పనులను అర్ధంతరంగా నిలిపివేసినట్టు తెలుస్తోంది.